
# వైఎస్ఆర్-అన్నమయ్య



# వార్త



బుధవారం 14 మే 2025


## వైభవంగా ముగిసిన గాలివీటమ్మ జాతర

గాలివీడు, మే 13(ప్రభాతవార్త):



మండల కేంద్రంలోని పవిత్ర కుషావతీ నదీతీరాన వెలసిన శ్రీ గాలివీటి గంగమ్మ జాతర మంగళవారం అసాదుని కథతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం రాత్రి 10 గంటల సమయంలో రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరలు, పర్వదినాలు హిందూ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయన్నారు. ముఖ్యంగా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య ఐక్యత, మతసామరస్యం చాటవచ్చన్నారు. ఇదిలా ఉండగా జాతరలో ఆర్కెస్ట్రా ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాల వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీనాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధికి కృషి

### టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు

రాజంపేట అర్బన్, మే13 ప్రభాతవార్త



పద కవితా పితామహుడు అన్నమాచార్యుని జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. మంగళవారం తాళ్లపాకలో అన్నమయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అన్నమాచార్యునికి పూజలు నిర్వహించారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి 32 వేల సంకీర్తనలు రచించి ,అంకితం ఇచ్చిన తొలి వాగ్గేయకరుడు అన్నమాచార్యులు ఈ ప్రాంతానికి చెందినవారు కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవ దేవునికి ఎంతో ప్రీతిపాత్రమైన అన్నమాచార్యులు నడయాడిన నేలపై తాము జన్మించడం చాలా ఆనందంగా ఉందనన్నారు.

# కళ్యాణం... కమనీయం...

భువనగిరిపల్లెలో అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం.. దశావతారాలలో పిలిస్తే పలికే దైవం నృసింహుడు



కళ్యాణ లక్ష్మీ నృసింహుడు



కళ్యాణ్ ఉత్సవానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న పసుపులేటి ప్రదీప్



గజసేవలో తరించిన లక్ష్మీనరసింహస్వామి

రాజంపేట అర్బన్, మే13ప్రభాతవార్త

రాజంపేట పట్టణం భువనగిరి పల్లె లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. ప్రముఖ రుత్వికులు రాజా స్వామి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని అధ్యంతం వేద పండితులు సందర్భోచిత వ్యాఖ్యానాలతో నృసింహ అవతార ఆవిర్భావం నుంచి అన్నింటిని సోదాహరణంగా భక్తులకు వినిపించారు. దశావతారాలలో పిలిస్తే పలికే దైవం నృసింహుడు మాత్రమేనని వేద పండితుడు రాజ స్వామి పేర్కొన్నారు. కళ్యాణోత్సవంలో భాగంగా సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, బాసికం, యజ్ఞోపవీతం, కన్యాదానం కార్యక్రమాన్ని వేద మంత్రాల సాక్షి గా నిర్వహించారు. ఋత్వికులు రాజా స్వామి మాట్లాడుతూ ఎక్కడ బ్రహ్మోత్సవాలు జరిగినా బ్రహ్మ విచ్చేసి నిర్వహిస్తారని అభివర్ణించారు. అందుకే బ్రహ్మోత్సవాలు అంటామనీ పేర్కొన్నారు.మాంగల్య పూజ విశిష్టతను వివరించారు. అనంతరం లక్ష్మీ నారాయణాభ్యోనా...సావధాన... శుభ ముహూర్తే సావధాన...శుభలగ్నే సావధాన ... అంటూ జీలకర్ర బెల్లం విశిష్టతను సావధానంగా వినిపించారు.అనంతరం వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య మాంగల్య ధారణ జరిగింది. భువనగిరి పల్లెలో గరుడసేవ అలంకారంలోనే లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ నిర్వహించడం అందుకే తిన సేవ లోనే స్వామికి కళ్యాణం ఉత్సవాన్ని వైభవంగా అంతకుముందు స్వామి కళ్యాణోత్సవానికి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు వీర ప్రదీప్ కుమార్ ,రమ్య దంపతులు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కళ్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్ కుమార్ దంపతులు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త అతికారి కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు హాజరయ్యారు. వారికి ఆలయ పాలకమండలి సభ్యులు ,వేద పండితులు ఘన స్వాగతం పలికారు. కళ్యాణ్ ఉత్సవాన్ని ఆలయ అర్చకులు కృష్ణ మోహన్ స్వామి, నటరాజ ,కాలి చరణ్ చూడముచ్చటగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మన్నేరు లక్ష్మీనరసయ్య , పూల హరి ప్రసాద్, కావేరి గారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, కంబాయి గారి నర్సింహులు, మాజీ సర్పంచ్ ఎం ఎల్ నారాయణ, కే.నరసింహ తదితరులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం చేసిన భక్తులకు ఆలయ కమిటీ అన్నప్రసాద వితరణ జరిపింది. రాత్రి కళ్యాణ నరసింహుడు నవ వధువు చెంచులక్ష్మి తో కలిసి గజసేవలో తరించారు.

## అవయవ దానంతో అందరికీ ఆదర్శం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

బ్రెయిన్ డెడ్ తర్వాత పలు అవయవాలు దానం

గుండె,లివర్,కిడ్నీల దానంతో మరికొందరికి ప్రాణదానం

బిడ్డను కోల్పోయాం, మా బిడ్డ అవయవాల దానంతో మరికొందరి ప్రాణాలు కాపాడడం గర్వంగా ఉంది : తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు



రాయచోటి అర్బన్ మే 13 ప్రబాతవార్త :

చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం అంపాబత్తునివారి పల్లెకు చెందిన మద్దిరాల కంచం రెడ్డి, కోటేశ్వరమ్మల దంపతుల కుమారుడు మద్దిరాల కొండారెడ్డి(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి అనంతరం అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను కాపాడి ఆ కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం మద్దిరాల కొండారెడ్డి బెంగళూరులో సివిల్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 8వ తేదీన రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికుల సమాచారం మేరకు పోలీసులు తీవ్రంగా గాయపడిన కొండారెడ్డిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యుల వైద్య సేవల అనంతరం సోమవారం రాత్రి మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యుల సూచనల మేరకు కొండారెడ్డి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను నిలబెట్టే దిశగా ఆలోచించారు. కొండారెడ్డి కి సంబంధించిన గుండె, లివర్, కిడ్నీలు తదితర అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అయితే కుమారుడి చదువు కోసం తల్లిదండ్రులు కంచెం రెడ్డి, కోటేశ్వరమ్మ లు ఎన్నో ఏళ్లుగా కష్టపడి వ్యవసాయ పనులు, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నారు. కూలీ డబ్బులతోనే కుమారుని, కుమార్తె ను చదివించుకున్నారు. కుమారుడు కొండారెడ్డి సివిల్ ఇంజనీర్ గా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని సంతోషం ఆ కుటుంబానికి చాలా రోజులు నిలబడలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం ఉన్న ఒక్క కుమారుడిని పోగొట్టుకున్నారు. దీంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తోపాటు చాకిబండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంతటి విషాదంలో కూడా ఆ కుటుంబ సభ్యులు, మృతుడి తల్లిదండ్రులు తన కుమారుడి అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. తన బిడ్డ అవయవాలు దానం చేయడంతో మరికొందరి ప్రాణాలను కాపాడడం వల్ల తనకు గర్వంగా ఉందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## ప్రతి రైతు పకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి



ముద్దనూరు, మే 13, ప్రభాతవార్త:

మండలం లోని అరవేటిపల్లె గ్రామంలో పకృతి వ్యవసాయము సంబంధించి మంగళవారం నాడు నిర్వహించిన ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యస్.వి.ప్రవీణ్ కుమార్ మరియు అడిషనల్ డీపీఎం వసంత కుమారి పాల్గోన్నట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో డీపీఎం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు సహజ సిద్ద పద్ధతులను అనుసరించి పకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి తద్వారా అధిక ఆదాయం పొందవచ్చును అన్నారు.భూమి పైన నివసిస్తున్న జీవ రాసులను కాపాడుకోవచ్చును అన్నారు.ప్రతి రైతు పకృతి వ్యవసాయం పైన మక్కువ పెంచుకోవాలి అన్నారు. అడిషనల్ డిపియం వసంత కుమారి మాట్లాడుతూ రైతులు రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు పకృతి వ్యవసాయం పైన మొగ్గు చూపి పంటలు సాగు చేయాలి అన్నారు.కషాయాలు తయారు చేసే విధానం గురించి తెలుసుకొని పంటల పైన పిచికారీ చేయాలి అన్నారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు పకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలి అన్నారు.మండలం పకృతి వ్యవసాయ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రామ సుధ మాట్లాడుతూ పకృతి వ్యవసాయం ఆచరిస్తున్న గ్రామాల్లో ఖరీఫ్ ప్రణాళిక సమావేశం నిర్వహించి గ్రామంలో ఉత్తమ పద్ధతులను అనుసరిస్తున్న రైతులను గుర్తించి వారిని సన్మానం చేయడం జరుగుతుంది అన్నారు. ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ పకృతి వ్యవసాయం గురించి తెలిపి పద్ధతులను ఆచరించే విధంగా రైతులను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఉత్తమ రైతులు బాల నర్సింహులు ,ఈశ్వరయ్యలను డీపీఎం,మరియు అధికారులు కలసి ఘనంగా శాలువ పూల మాలలు వేసి సన్మానం చేశారు.తదుపరి బడుగు వారి పల్లె లోని రైతు మహేష్ గారి నేరేడు పంట, ఇతర పండ్ల మొక్కల ఉన్న ఫీల్డ్ విజిట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ అభ్యుదయ రైతు రామలింగేశ్వర నాయుడు యంగ్ ప్రొఫెషనల్ భరత్ పాటిల్,ఎపియం అపర్ణ దేవి, యూనిట్ ఇంచార్జ్ ముని భూపాల్,ఐసీఆర్పీలు,యన్.యఫ్.ఐ, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవం

పెండ్లిమర్రి, మే 13, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం పాత సంగటిపల్లె గ్రామంలో అత్యంత పురాతన నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అలాగే వెయ్యినూతల కోనలో వేద పండితులతో మంగళ వాయిద్యాలతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త పిన్నిపాటి హరిప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు సహకరించిన గ్రామ ప్రజలు నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వృషభ రాజములకు బండ లాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రబాబురెడ్డి, ఆలయ ధర్మకర్త కొండమ్మ గారి శేఖర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మునిరెడ్డి, చంద్రారెడ్డి, హైవారెడ్డి, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



### మహానాడు సందర్భంగా

## పటిష్ట భద్రతా చర్యలు





కడప మే 13: ప్రబాతవార్త :

ఈ నెల 27, 28, 29 తేదీలలో చింతకొమ్మ దిన్నె పి.ఎస్ పరిధిలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు వి.ఐ.పి లు హాజరు కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాలు లో ఎస్.ఎస్.జి ఎస్.పి శ్రీ ఆరిఫ్ హఫీజ్ ఐ.పి.ఎస్, ఎస్.ఎస్.జి డైరెక్టర్ శ్రీ నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ , ఎస్.ఎస్.జి ఎస్.పి శ్రీ జి.హెచ్ భద్రయ్య లతో కలిసి జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ కు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) శ్రీ కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, కడప డి.ఎస్.పి జి.వెంకటేశ్వర్లు, ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాసరావు, ఎస్.బి ఇన్స్పెక్టర్‌లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు, జిల్లాలోని సిఐలు పాల్గొన్నారు.

### ఈతకు వెళ్లి మల్లెపల్లె చెరువులో

## ఐదు మంది చిన్నారులు గల్లంతు

బ్రహ్మంగారి మఠం మే 13 ప్రభాతవార్త:

బ్రహ్మంగారిమఠం మండలం మల్లెపల్లె గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది మల్లెపల్లెలోని స్థానిక చెరువులో మధ్యాహ్న సమయంలో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు తరుణ్,చరణ్,పార్థు,హర్ష,దీక్షిత్ గల్లంతయ్యారు స్థానికులు ఇచ్చిన సమాచారంతో మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, సీఐ శివశంకర్,ఎస్సై శివప్రసాద్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాలతో చెరువులో చిన్నారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు చెరువు గట్టు పైన చిన్నారులు విడిచిన దుస్తులు ఉండడం రాత్రి సమయమైనా ఆచూకీ లభించకపోవడంతో చిన్నారులు మునిగిపోయి ఉంటారని అందరూ భావిస్తున్నారు ఈ సంఘటనతో తల్లిదండ్రులు గ్రామ ప్రజలు సుఖసంద్రంలో మునిగిపోయారు.



## ఇంటి దొంగల పనేనా ?

పెళ్లి ఇంట్లో 30 లక్షలు విలువ చేసే నగలు మాయం

బాధితురాలు అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు

రాజంపేట అర్బన్, మే13ప్రభాతవా ర్త

అన్న కుమార్తె వివాహానికి వచ్చిన చెల్లెలు బ్యాగులోని 30 లక్షలు విలువచేసే బంగారం మాయమైన సంఘటన రాజంపేటలో ఆలస్యంగా వెలుగు చూసింది. రాజంపేట ఎస్పి రామ్నాథ్ హెగ్డే కు బాధితురాలు నాగమణి చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలో నివాసం ఉంటున్న నాగమణి అనే మహిళ గత నెల 28 వచ్చింది. వివాహం కాలంతో వెంట 343 గ్రాముల బంగారు నగలు వెంట తీసుకువచ్చింది. తన సోదరుడు జోగి సుదర్శన్ రెడ్డి కుమార్తె సాయి నందిని వివాహ వేడుకలలో పాల్గొనేందుకు తన కుమార్తె వర్షిణి తో కలిసి సాయంత్రం 6 గంటలకు సమయంలో రాజంపేటకు విచ్చేసి తమ వెంట బంగారం నగలతో కూడిన లగేజ్ బ్యాగ్ ను బెడ్రూంలో మంచం కింద భద్రపరిచామన్నారు. రాత్రి 10:30 గంటలకు నిద్ర ఉపక్రమించే ముందు డ్రెస్సులు మార్చుకునేందుకు తమ కుమార్తె వర్షిని బ్యాగును ఓపెన్ చేసినప్పుడు బంగారం అందులో ఉందని అన్నారు. మరుసటి రోజు ఉదయం 29వ తేదీ 6 గంటలకు నిద్ర లేచి పెళ్లి పనుల్లో నిమగ్నమై ఉన్న తాము 10 గంటల సమయంలో స్నానానికి వెళ్లేందుకు బ్యాగు ఓపెన్ చేయగా అందులో చిందరవందరగా దుస్తులు ఉన్నాయన్నారు. అందులో ఉన్న బంగారు నగలు కనిపించలేదన్నారు. ఇదే విషయం తన అన్నతో పాటు బంధువులకు తెలిపి సీసీ ఫుటేజ్ ని పరిశీలించామన్నారు. తాము ఎవరిని గుర్తించలేకపోవడంతో అదే రోజు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. మా కుమార్తె, కుమారుడుతో కలిసి మేము నిద్రించిన రూములో వస్తువులను వెతికెందుకు ప్రయత్నించగా జోగి సుకన్య అనే మహిళ ఆ రూముకు తాళం వేసి తన దగ్గర ఉంచుకొని మమ్మల్ని అడ్డుకుందన్నారు .అదేవిధంగా అదే రోజు జరిగిన పెళ్లికి సైతం సుకన్య వెళ్ళకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమకు 19 మంది మీద అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసామన్నారు. తర్వాత ఆ 19 మంది వద్ద 30వ తేదీ ఏఎస్పీ కార్యాలయంలో ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారన్నారని పేర్కొన్నారు.చేతి వేలిముద్రలు తీసుకున్న తరువాత జోగి చందన, భక్తవత్సల రెడ్డి, జోగి సుదర్శన్ రెడ్డి, జోగి తేజ కువైట్ కు వెళ్లారన్నారని తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారన్నారు.ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత జోగి సునంద, వర్ష కువైట్ కు వెళ్ళటం తన అనుమానాలకు బలం చేకూర్చిందన్నారు. ప్రధాన అనుమానితుడు జోగి సుదర్శన్ రెడ్డి కువైట్ కు వెళ్లినప్పటికీ ఇండియాలో ఉన్న జోగి చెంగమ్మ, జోగి సుకన్య, సరోజనమ్మ లను విచారిస్తే బంగారం ఆచూకీ బయటపడుతుందని వెంటనే ఈ దిశగా విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఏఎస్పీకి విన్నవించినట్లు మీడియాకు తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రామ్నాథ్ హెగ్డే

## డిప్యూటీ డిఈఓ పై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు విఫలం



**ప్రొద్దుటూరు అర్బన్, మే 13, ప్రభాతవార్త :**

ప్రొద్దుటూరు పట్టణంలోని ఉన్న డిప్యూటీ డిఈఓ ఆఫీసుకు తాళం వేయడం చాలా యాదృచ్ఛికరమైన చర్య అని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు మాట్లాడుతూ ప్రొద్దుటూర్ పట్టణంలోని డిప్యూటీ అధికారులు డ్యూటీకి రావలసిన సమయం లో రాకుండా ఆమె తాళం వేసుకోవడం కంప్యూటర్లు రికార్డులను తన సొంత వస్తువులగా భావించుకొని తాళాలు వేసుకోవడం ఎంతవరకు తగునని 16 మండలాలు ఉన్న డిప్యూటీ డిఈఓ ఆఫీస్ పరిధిలో రెగ్యులర్ డిప్యూటీ డీఈవోగా కొనసాగుతూ తన వృత్తి ధర్మానికి న్యాయం చేయకుండా అక్కడ పనిచేసే అటెండర్లను వాచ్మెన్లను బండ బూతులు తిట్టడం జరుగుతోంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఏదైనా ఫైల్ చేయమని ఆఫీస్ కి వస్తే వారిని అక్కడ వెయిట్ చేయించి ఇంటికి పంపించడం జరుగుతోందన్నారు. అధికారుల మూమెంట్ రికార్డ్ను కూడా మెయింటెనెన్స్ చేయకుండా ఆమె విధులను కడప నందు తన ఇంటి నుండి నిర్వహించడం ఎంతవరకు సబబు అని చెప్పేసి విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ని, జిల్లా విద్యాశాఖ అధికారులను అడుగుతున్నామని విధుల లో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఓ పై వెంటనే చర్యలు తీసుకొని మరొక డిప్యూటీ డీఈఓ ను ప్రొద్దుటూరుకు ఏర్పాటు చేయాలని ఈ సమస్యను జిల్లా అధికారులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బయన్న,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పుష్ప పల్లకిలో ఊరేగిన శ్రీ వేణుగోపాలస్వామి

**రామసముద్రం,మే 13 ప్రభాతవార్త**



మండలం లోని కేసీ పల్లె గ్రామం లో వెలిసియున్న శ్రీ వేణుగోపాల స్వాములవారి బ్రహోత్సవాలను కార్య నిర్వాహకులు, గ్రామస్థులు, ఆలయ పూజారులు పుష్ప పల్లకిని పలురకాల పుష్పాలతో ముస్తాబు చేసి, పుష్ప పల్లకిలో స్వామి వారిని పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగింపు చేశారు. మహిళలు భక్తులు స్వామి వారికి మంగళహారతులు పట్టి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలను విద్యుత్ దీపాలంకరణతో మిరమిట్లు కొలుపే కాంతులతో అందంగా అలంకరించారు. ఈవేడుకలకార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు వేణుగోపాల స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఏ ఎస్సై హిమాచలపతి ఆధ్వర్యంలో సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ వేడుకలు వీక్షించిన భక్తులకు గ్రామ స్థులు అన్నదానం నిర్వహించారు.


## శ్రీవారి నగర్ లో వైభవంగా గంగ జాతర

**మదనపల్లి మే 13 ప్రభాతవార్త.**



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారి నగర్ లో వెలిసి ఉన్న గ్రామ దేవత శ్రీ శ్రీ బోయకొండ గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి విశేషాలంకరణ చేసి అర్చకులు కుమారు స్వామి, సురేంద్ర స్వాముల ఆధ్వర్యంలో అభిషేకం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం రాత్రి అమ్మవారిని శ్రీవారి నగర్ లో మేల తాళాలతో ఊరేగింపు చేసి పూజలు చేశారు. బుధవారం తెల్లవారుజామున మహిళలు దీలు, బోనాలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఘనంగా పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. బుధవారం పగులు తిరుణాల జరగనున్నది.

## విద్యుత్ కోతలతో ప్రజలకు ఉక్క పోత, పెద్దలు పిల్లలకు ఇబ్బందులు,



**మైదుకూరు, మే 13, ప్రభాతవార్త:**

పట్టణంలో ఈ మధ్యకాలంలో కరెంటు కోతలతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎప్పుడు పడితే అప్పుడు టైమింగ్ లేకుండా కరెంటు కోతలు విధించడంతో మే నెల ఎండలు తీవ్రత ఉండడం అంతేకాకుండా పనులు లేక ఎక్కువ శాతం ఇంటి దగ్గరే పెద్దలు, చిన్నపిల్లలు, కుటుంబ సభ్యులు ఎండలు తీవ్రత దృశ్య ఉక్క పోతతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు నెల బిల్లులు మాత్రం పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్న నిరంతరం విద్యుత్ మాత్రం ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరాలో లోపాలు.ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే విద్యుత్ అధికారులు స్పందించి నిరంతరం విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## కేసుల స్థితిగతులపై ఆరా తీసిన డి.ఎస్.పి

**బద్వేలు, మే 13, ప్రభాతవార్త**

బద్వేలు పోలీస్ స్టేషన్ ఆవరణం లోని బద్వేలు రూరల్ కార్యాలయం నందు మంగళవారం మైదుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ , సబ్ డివిజన్ పరిధిలోని బద్వేలు అర్బన్, పోలీస్ స్టేషన్, బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్, అట్లూరు, బి కోడూరు ,పోరుమామిళ్ల , కలసపాడు, కాశినాయన పోలీస్ స్టేషన్ అధికారులకు, క్రైమ్ మీటింగ్ నిర్వహించి డీఎస్పీ కేసుల స్థితిగతులపై మరియు ఇటివల జరిగిన ముఖ్యమైన క్రైమ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. అలాగే ముఖ్యంగా ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. పెరుగుతున్న చోరీలు, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై, పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్ష, ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ పెంపుదల గురించి, అధికారులు,సిబ్బంది నేర నిరోధానికి చురుకైన విధంగా పనిచేయాలని సిబ్బందికి సూచనలు ఇవ్వడమైనది



## వైభవంగా ఎలకపల్లె గ్రామంలో బండెమ్మ జాతర

### బోనాలు సమర్పించిన భక్తులు

**రామసముద్రం మే 13 ప్రభాతవార్త**

మండలంలోని ఎలకపల్లె గ్రామంలో గ్రామపెద్దలు గ్రామస్తులు ఆధ్వర్యంలో బండెమ్మ తిరుణాళ్ళ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంవద్ద పచ్చని తోరణాలు కట్టి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం వారం అమ్మ వారికి ప్రత్యేకంగా మహిళలు ఉపవాసలతో దీలు.బోనాలు మోసి మొక్కులు చెల్లించు కున్నారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. పచ్చని తోరణాలతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మ వారిని పలు రకాల పుష్పాలతో అమ్మ వారికి అలంకరణ చేసి అమ్మవారికి పసుపు కుంకుమలు పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మ వారి జాతర జరిగే గ్రామాల్లో బంధువులరాక తో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు గ్రామ పెద్దలు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఈనెల 20న జాబ్ మేళా

**రాజంపేట అర్బన్, మే13 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20న మెగా ఉద్యోగా మెళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, ఇండిగో ఎయిర్లైన్స్, ఆధ్య హెచ్ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్ సి, ఫోన్ పే ఫ్లిప్ కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, ఉన్నటువంటి యువతీ యువకులు ఈ క్రింది ఉద్యోగామెళను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.మరిన్ని వివరములకు 9603770097, 9502527277, 8897776368 మొబైల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీకి 110 జీవో అమలు చేయాలి



**వేంపల్లె :మే 13:(ప్రభాతవార్త)**

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీగా పని చేస్తున్న ఉద్యోగులకు 110 జీవోను అమలు చేయాలని కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. మంగళవారం మండలంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తాను కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు 110 జీవోను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో 2018 నుండి పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీకి జీవో 110 అమలు చేయక పోవడం వలన జీతాలు తక్కువగా వస్తున్నట్లు చెప్పారు. 110 జీవోను అమలు చేసి 2018 నుండి ఇప్పటి వరకు కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీలకు సర్వీసు కలపాలని కోరారు. అలాగే సర్వీసు బట్టి రావాల్సిన రూ 40 వేలు జీతాలను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీల సమస్యను పరిష్కరించాలని ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు జూన్ 11,12,13 తేదిల్లో ఆయా ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలు అందరూ కలిసి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమ్మె నోటిసును ఇడుపులపాయ డైరెక్టర్ కు అందజేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నత్తడ్ షావలి ఉరుసు



**ఖాజీపేట, మే 13, ప్రభాతవార్త:**

వేసవి కాలం నిత్యం తిరునాళ్ళ, జాతర్ల కాలం. ఉగాది తర్వాత గ్రామాల్లో వరుసగా జాతరలు, తిరునాళ్ళలు నిర్వహించే సమయమిది. ఈ మధ్య అంకాలమ్మ తిరునాళ్ళ, పుష్పగిరి తిరునాళ్ళ, నిన్న సుంకేసుల గ్రామంలో మొలకల పూర్ణిమ తిరుణాల, గత రెండు రోజుల నుండి ఖాజీపేట మండలం కె.అగ్రహారం గ్రామంలో శ్రీ హజరత్ ఖాజా సయ్యద్ షా నత్తడ్ షావలి ఉరుసు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి గారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఖాజీపేట ఎంపీటీసీ జంగిటి శివప్రసాద్ మరియు కమిటీ వారు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతిగా 40,000 రూపాయలు, రెండవ బహుమతి 30 వేల రూపాయలు, మూడో బహుమతి 20000, నాలుగో బహుమతి 10000, ఐదవ మహతి 5000 రూపాయలను విజేతలకు అందించడం జరిగింది.

## ఆర్మీ జవాన్ వివాదాస్పద భూమిని పరిశీలించిన ఎమ్మెల్యే షాజహాన్ భాషా

**రామసముద్రం మే 13 ప్రభాతవార్త**

మండలంలోని చిట్టెం వారి పల్లెకు చెందిన ఆర్మీ జవాన్ మోహన్ కుటుంబానికి చెందిన వివాదాస్పద భూమిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషా మంగళవారం పరిశీలించారు.ఇందుకు సంబంధించి రికార్డులను తహసీల్దార్ నిర్మలాదేవిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల వాదనలు విన్న ఎమ్మెల్యే వివాదాస్పద భూమికి సంబంధించిన మొత్తం భూమిని సర్వేచేసి రెండు రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ ను ఆదేశించారు.సర్వే రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధితులకు తగిన న్యాయం చేస్తామని,అంతవరకు ఇరు వర్గాల వ్యక్తులు ఘర్షణలకు వెళ్ళరాదని అని అన్నారు .



## అంగరంగ వైభవంగా నిత్య కళ్యాణ దేవత మూర్తుల బ్రహ్మోత్సవాలు

**కమలాపురం మే 13 ప్రభాతవర్త**

మండలం శ్రీ రామాపురం మహా పుణ్యక్షేత్రంలో వెలిసిన నిత్య కళ్యాణ దేవతామూర్తులు శ్రీ మహాలక్ష్మి మోక్ష నారాయణ స్వామి శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సంజీవిని మూలిక సహిత వీరాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల పదవ తేదీ శనివారం నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో భక్తాదులు విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. మంగళవారం మాడవీధులలో దేవతామూర్తుల ఊరేగింపు ఉత్సవం కనుల పండువగా జరుగుతోంది. కడప పార్లమెంట్ సభ్యులు వైస్ అవినాష్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఇతర నాయకులు భారీ సంఖ్య లో భక్తులు బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటున్నారు.గత నాలుగు రోజులుగా వేదపండితుల మంత్రాల తో హోమ అర్చనలతో ఆలయ ప్రాంగణం మారు మోగుతోంది. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రధాన సేవకులు కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ ఆలయ సేవాకర్తలు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం పార్లమెంటు సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి ఆలయానికి విచ్చేశారు ఆలయ మర్యాదలతో వేద పండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందించారు. ఆలయ చరిత్రను విశిష్టతను ఆలయ ప్రధాన సేవకులు కాశీ భట్ల సత్య సాయినాథ్ శర్మ అవినాష్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధి చెందడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని దేవతా మూర్తులు ఇక్కడ వెలియడం జిల్లాకే తల మాణిక్య మన్నారు. ఆలయంలో దేవతా మూర్తులకు భక్తిశ్రద్ధలతో పూజా సేవలు నిర్వహింప చేస్తున్న సాయినాథ్ శర్మ అభినందనీయుడన్నారు. ఆయన వెంట భారీ సంఖ్యలో ప్రజలు ఆలయానికి విచ్చేశారు. గుంటూరు కు చెందిన సలక్షణ ఘనాపాఠి వంశీకృష్ణ ఆయన శిష్య బృందం బ్రహ్మోత్సవ విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సిపి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## సియాచిన్‌లో తొలి మహిళా ఆఫీసర్

మిలిటరీలో చేరాలనుకోవడమే ఓ సాహసమనుకుంటే.. ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రం సియాచిన్‌లో విధులు నిర్వర్తించాలనుకోవడం ప్రాణాలను ఫణంగా పెట్టడమే! ఏ కాలమైనా-50 డిగ్రీల ఉష్ణోగ్రత, మంచు దుప్పటి కప్పుకొన్న కొండలు, ప్రమాదకరంగా విరిగిపడే కొండ చరియలు, శత్రుమూకలు ఎప్పుడు.. ఎటు నుంచి దాడి చేస్తాయో తెలియని పరిస్థితులు.. చేస్తే ఇలాంటి చోటే ఉద్యోగం చేయాలనుకుంది కెప్టెన్ సుప్రీత సిటీ. దేశ సేవకే తన జీవితాన్ని అంకితమివ్వాలని మూడేళ్ల క్రితం ఇండియన్ ఆర్మీలో చేరిన ఆమె. ఇటీవలే తన కలను నెరవేర్చుకుంది. ఆర్మీ ఎయిరడ్ డిఫెన్స్ దళం' నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం దక్కించుకున్న చరిత్ర సృష్టించింది. సుప్రీతది మైసూరు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తిచేసిన ఆమె.. అక్కడి జెఎస్ఎస్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించింది. చిన్నతనం నుంచి ఆమెకు దేశభక్తి ఎక్కువ. దీనికి తోడు ఆమె కుటుంబంలో చాలామంది ప్రభుత్వోద్యోగాల్లో స్థిరపడిన వారే! ఇదే తనను దేశసేవ వైపు వచ్చేలా ప్రేరేపించిందంటోందామె.

**ఎన్‌సిసిలో చేరి...**



నాది ప్రభుత్వోద్యోగ నేపథ్యం ఉన్న కుటుంబం. నాన్న తిరుమలేశ్. సబ్ స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ నిర్మల గృహిణి. మా తాతముత్తాతలూ ప్రజా సేవ చేసిన వారే. ఇలా వీళ్లను చూస్తూ పెరిగిన నేనూ.. పబ్లిక్ సర్వీస్‌లోకి రావాలను కున్నా. పైగా నాకు చిన్నతనం నుంచి దేశ సేవ చేయడమంటే ఇష్టం. ఈ మక్కువతోనే స్కూల్లో ఉన్నప్పుడే ఎన్‌సిసిలో చేరాను. ఎన్‌సిసి ఎయిర్ వింగ్-సి' సర్టిఫికెట్ కూడా పొందాను. ఎన్‌సిసి క్యాడెట్‌గా పలుమార్లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'కర్ణాటక-గోవా' దళానికి నాయకత్వం వహించా. 2016లో ఆలిండియా వాయు సైనిక్ క్యాంపునకూ ప్రాతినిథ్యం వహించా..' అంటోన్న సుప్రీతకు ఆటలన్నా భలే ఇష్టమట! ఈ క్రమంలోనే స్కూల్లో ఉన్నప్పుడే పలు క్రీడల్లో పాల్గొని సతా చాటిందామె.



**కఠోర శిక్షణతో రాటుదేలి..!** దేశ సేవ చేయాలన్న మక్కువతో 2021లో ఇండియన్ ఆర్మీలో చేరిన సుప్రీత.. లెఫ్టినెంట్‌గా తొలి బాధ్యతలందుకుంది. అయితే అంతకంటే ముందు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో కఠోర శిక్షణ తీసుకుందామె. రక్షణ రంగంలోకి వచ్చాకా ఆమె దృష్టంతా సియాచిన్ యుద్ధక్షేత్రం పైనే ఉండేది. అందుకే ఎప్పటికైనా ఇక్కడ విధులు నిర్వర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్న సుప్రీత.. ఇక్కడి ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకునేలా తన శిక్షణను కొనసాగించింది. ఇలా ఆమె ధైర్యసాహసాలు, సంకల్పానికి తగినట్లే అనంత్‌నాగ్, జబల్‌పూర్, లేహ్.. వంటి వ్యూహాత్మక ప్రదేశాల్లో శిక్షణ నిమిత్తం ఆమెను పంపించారు. ఆర్మీ అధికారులు, ఓ వైపు వాళ్ల అంచనాల్ని నిజం చేస్తూనే.. మరోవైపు విధుల్లో తెగువను ప్రదర్శించేదామె. ఇదే ఆమెను సియాచిన్ యుద్ధక్షేత్రంలో ఆఫీసర్ నియమించేలా చేసింది. తద్వారా 'ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ దళం' నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం దక్కించుకున్న తొలి మహిళా ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది సుప్రీత. ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధక్షేత్రంగా పిలిచే ఈ ప్రదేశంలో అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులుంటాయి. వీటికి తోడు శత్రు దాడులూ ఎక్కువే! ఇలాంటి ప్రదేశంలో పనిచేసినప్పుడే మన సత్తా ఏంటో తెలుస్తుందంటోందీ డేరింగ్ ఆఫీసర్. ఇక గతంలో ఆర్మీలోని 'ఫైర్ అండ్ ఫ్యూరీ' దళానికి చెందిన కెప్టెన్ శివ ఛౌహాన్.. ఆ దళం నుంచి సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తించే అవకాశం అందుకున్న తొలి మహిళా ఆఫీసర్‌గా నిలిచింది.

**తొలి జంటగా ఘనత...** సుప్రీత భర్త జెర్రీ బ్లెయిజ్ ఇండియన్ ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నారు. అయితే ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా కర్తవ్య పథ్‌లో నిర్వహించిన కవాతులో వేర్వేరు బృందాల్లో సభ్యులుగా ఈ భార్యాభర్తలిద్దరూ పాల్గొన్నారు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి ఆర్మీ కపుల్‌గా నిలిచారు. గతేడాది జూన్‌లో వివహం చేసుకున్న వీరిద్దరూ గతంలో ఎన్‌సిసికానయడెట్లుగానూ కర్తవ్య పథ్ కవాతులో పాల్గొ న్నారు. ఉద్యోగ రీత్యా వేర్వేరు ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తోన్న మేము రిపబ్లిక్ పరేడ్‌లో భాగంగా కలిసి సాధన చేశాం.. మేమిద్దరం జీవితంలోనే కాదు.. దేశ సేవలోనూ భాగస్వాములవడం సంతోషంగా ఉంది.. అంటున్నారీ ఆర్మీ కపు.. అప్పట్లో ఈ జంట ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.



## రోజుకో గంట చదివి లక్షల జీతం ..

**నెల తిరిగేసరికి ఇంటి అద్దె కట్టడానికి నాన్న పడుతునన కష్టాన్నీ.. ఇద్దరమ్మాయిలే ఎలా నెట్టుకోస్తామో ఈ జీవితాన్ని అని అమ్మ పడుతున్న ఆవేదనను కళ్లారా చూసింది. కోచింగ్ ఊసే లేకుండా నాలుగేళ్లపాటు రోజుకో గంట సాధన చేసి కోడింగ్‌పై పట్టు పెంచుకుంది. పే-పాల్ కంపెనీలో రూ.34 లక్షలకుపైగా వార్షిక వేతనానికి ఎంపికయింది. కన్నవాళ్ల కలల్నీ, ఇబ్బందుల్నీ తీర్చాలను కుంటోంది. ఆమే హుజూరాబాద్‌కి చెందిన యాల్ల కృష్ణవేణి.**

పేధింటి ఆడబ్డిని.. అమ్మానాన్నల కష్టాలు చూస్తూ పెరిగా. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి ఎలాగైనా మంచి ప్యాకేజీతో ఉద్యోగం అందుకోవాలననది నా లక్ష్యం. దాన్ని సాధించగలిగా, అయితే, ఈ విజయం అంత సులవుగా మాత్రం రాలు. మాది హనుమకొండ జిల్లా పెంచికల్‌పేట. నాకు ఊహ తెలిసేనాటికే అమ్మానాన్నలు ఉపాధి కోసం హుజూరాబాద్‌కు వచ్చేశారు. నాన్న సదిరెడ్డి ప్రైవేటు చిట్‌ఫండ్‌లో ఉద్యోగి. అమ్మ అంజలి గృహిణి. చెల్లె హరిప్రియ మెడిసిన్ చదువుతోంది. అమ్మానాన్నలు మాకోసం ఎంతో కష్టపడుతున్నారని చిన్నప్పుడే అర్థమైంది. ఆ ఇబ్బందుల నుంచి గట్టెక్కాలంటే చదువు తప్ప మరో దారి లేదని భావించా. అందుకే, ఏ తరగతైనా నేనే ఫస్ట్ బిటెక్ హనుమకొండ సమీపంలోని ఎస్సార్ కళాశాలలో సిఎస్ఇలో ఏరాను.

**ఆ భయం వెంటాడటంతో....** ఓ పక్క ఇంజినీరింగ్ పూర్తయినా ఉద్యోగాలు దొరక్క ఇబ్బందిపడుతోన్న సీనియర్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తే, మరో పక్క ఇంటి అద్దె చెల్లించలేని నాన్న స్థితి కలవరపెట్టింది. దీంతో అందరికంటే భిన్నంగా చదివితేగానీ అనుకున్న లక్ష్యం చేరుకోలేనని అర్థమైంది. అందుకే, చదువుతో పాటు ఇతర నైపుణ్యాలపైనా పట్టు తెచ్చుకోవాలనుకున్నా. ఇందుకోసం రోజూ ఒక గంటపాటు కోడింగ్‌పై పట్టు పెంచుకోవడం ఆరంభించా. మధ్యమధ్యలో సినిమాలు, రీల్స్.. వంటి వాటి గురించి స్నేహితులు చెప్పినా.. నాకు మాత్రం నా లక్ష్యమే గుర్తొచ్చేది. అవి చూసేత కాసేపు ఆనందంగా అనిపించొచ్చు కానీ, నేను ఎంచుకున్న పంథాలో విజేతగా నిలిస్తే ఎప్పటికీ సంతోషమే నా వెంట ఉంటుందని నాకు నేను సర్దిచెప్పుకొనేదాన్ని.

**ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా...** ఇలా బిటెక్



మొదటి ఏడాది నుంచి ఫైనల్ ఇయర్ వరకు రోజూ కచ్చితంగా ఫోన్ ల్యాప్‌టాప్‌లను కేవలం కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణానయల్ని నేర్చుకునేందుకే వాడా. తాజాగా వచ్చిన చాట్‌జీపిటీలో ప్రతిభ చూపించి మూడునెలల పెయిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశం దక్కించుకున్నా. తరవాత జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పే-పాల్ కంపెనీలో రూ.34.40 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికాయ్య. అంటే నెలకు సగటున 2,86 లక్షల జీతాన్ని ందుకోబోతున్నా. నాన్న ఇప్పటికీ రూ.15 వేల కోసం పడుతున్న కష్టం చూసి.. నా శ్రమ ఫలించిందనే సంతోషం ఇప్పుడు మనస్ఫూర్తిగా కలుగుతుంది. ఎవరికైనా నేనొకటే చెబుతా.. ఎంత కష్టమైనా ఇష్టమైన దాని కోసం కష్టపడితే కచ్చితంగా విజయం సాధించగలమనడానికి నేనే ఓ ఉదాహరణ.

## చౌక దుకాణాల వద్దే రేషన్ బియ్యం ఇవ్వండి

ఎమ్మెల్యే షాజహాన్ భాష



మదనపల్లి మే 13 ప్రభాతవార్త

చౌక దుకాణాలవద్దే రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచించారు. మంగళవారం చౌక్ దుకాణ డీలర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల ద్వారా బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని ప్రజల తన దృష్టికి తెచ్చారన్నారు. ఇకనుంచి కార్డుదారులకు స్టోర్ వద్దే బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు ఇవ్వాలని కోరారు. ఇత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే చౌక దుకాణాన్ని రద్దు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. రూరల్ మండలంలోని చీకిలబయిల లో జరిగిన గంగ జాతుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. వేంపల్లి పంచాయతీలోని నల్లగొట్టపల్లిలో సీఎం సహా నిధి చెక్కును పంపిణీ చేశారు. అమ్మ చెరువు మిట్ట ఒకటో వార్డులో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వార్డులో ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఐటియుసి డివిజన్ కన్వీనర్ జి. కృష్ణ మూర్తి పిలుపు



మదనపల్లెక్రైమ్, మే 13 ప్రభాతవార్త.

మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐటియుసి డివిజన్ కన్వీనర్ జి. కృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం సమ్మె జయప్రదం చెయ్యాలని కోరుతూ ఐ టి యు సి ఆధ్వర్యంలో స్థానిక సర్వ జన ప్రభుత్వ బోధన ఆసుపత్రి నందు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. కృష్ణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అడ్డుకు నేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20వ తేదిన సమ్మెకు పిలుపునిచ్చారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సార్వత్రిక సమ్మె కు అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం ధరలకు అనుగుణంగా 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుడు కూడా కార్మికులకు అరకొరగా మాత్రమే అమలు జరిగేవని, ఇప్పుడు 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన తర్వాత భారతీయ కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడతారని హెచ్చరించారు. హైర్ అండ్ ఫైర్, ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, అప్రెంటీస్ విధానాల ద్వారా కార్మికుల శ్రమను కార్పొరేట్ యాజమాన్యాలకు దోచి పెట్టేందుకే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చిందని ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజ మాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్నీ కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభల కోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మే 20 సమ్మెలో కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా భారీగా పాల్గొనడం ద్వారా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, జ్యోతి లక్ష్మి, రాజేశ్వరి, సహెదా, రేణుక, గంగులమ్మ, అలివేలు పాల్గొన్నారు.

## జనసేన జెండా ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



మదనపల్లెక్రైమ్, మే 13 ప్రభాతవార్త.

కొండామర్రిపల్లి పంచాయతీలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై జనసేన నాయకుడు మైఫోర్స్ మహేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండా ధ్వంసానికి నిరసనగా జనసేన కార్యకర్తలతో కలిసి ఆ ప్రాంతంలో నిరసన తెలిపారు. అనంతరం మదనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జనసేన పార్టీకి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. జనసేన జెండాను ముట్టుకోవడమంటే మా తలలను ముట్టుకున్నట్లే. ఒక్క జెండాను తొలగిస్తే, వెయ్యి జెండాలను ఏర్పాటు చేస్తాం. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో జనసేన జెండా రెపరెపలాడుతుంది అని ఆయన స్పష్టం చేశారు. జెండాను ధ్వంసం చేసిన వారికి దమ్ము, ధైర్యం ఉంటే అర్ధరాత్రిలో జెండాలు తొలగించడం కాకుండా నేరుగా జనసైనికులతో తలపడాలని సవాల్ విసిరారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు దేశ వ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భవ్య కిషోర్, మాలతి రమేష్, అమర నారాయణ మరియు పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు

మదనపల్లెక్రైమ్, మే 13 ప్రభాతవార్త.

జిల్లా ఎయిడ్స్, లెప్రెస్, టి బి అవగాహన కోసం కళా జాతర బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. మంగళవారం ఏ ఆర్ టి మెడికల్ ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మదనపల్లి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కళాకారులు తమ నాటకాల ద్వారా హెచ్.ఐ.వి./ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, దానిని నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, వాటి చికిత్స, ఐసీటీసీ కౌన్సిలింగ్ కేంద్రాల గురించి, హెచ్.ఐ.వి. పాజిటివ్ వ్యక్తులను సమాజంలో ఎలా చూడాలి, వారితో ఎలా మెలగాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం ప్రజల్లో హెచ్.ఐ.వి.,ఎయిడ్స్ పట్ల సరైన అవగాహన కల్పించి, అపోహలను తొలగించడానికి కృషి చేస్తుంది. ప్రజలు ఈ ప్రదర్శనలను తిలకించి, హెచ్.ఐ.వి,ఎయిడ్స్ పై సరైన అవగాహన పొందాలని అధికారులు కోరుతున్నారు.



## కూలీలందరికీ పని కల్పిస్తాం: ఎంపీడీఓ



గాలివీడు, మే 13(ప్రభాతవార్త):

జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పిస్తామని ఎంపీడీఓ జవహర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీలో భాగంగా అరవీడు గ్రామంలో జరుగుతున్న పెద్దచెరువు కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీల హాజరు మస్టర్ ప్రకారం ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రధానమంత్రి బీమా యోజన పాలసీ గురించి కూలీలకు అవగాహన కల్పించారు. ఉపాధి పనుల్లో కూలీలందరూ పాల్గొని పనిదినాలను పెంచాలని జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అందరూ కూడా సద్వినియోగం చేసుకొని కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామచంద్ర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## తొమ్మిది మంది జూదరులు అరెస్ట్

మదనపల్లెక్రైమ్, మే 13 ప్రభాతవార్త.

తొమ్మిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్టు ఒకటో పట్టణ సీఐ ఎరిసావల్లి తెలిపారు. వారి వద్ద నుంచి 32 వేల రూపాయలు పధనం చేసుకున్నారు. సిఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి పట్టణ శివారులోని నక్కలదిన్నె సమీపంలో శ్రీ కాలనీలో కొందరు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడం జరిగింది. శ్రీ ఆదేశాల మేరకు ఎస్సై శివకుమార్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 32080లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిపై ఏపీ గేమింగ్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ప్రధాన కాలువ పూడిక పనులు



ప్రొద్దుటూరు మే 13 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని ఐదు ప్రధాన కాలువల బుడగతీత పనులకు మున్సిపల్ అధికారులు అధికారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పట్టణము నందు ఉన్నటువంటి ప్రధాన కాలువలు నందు పూడక తీత పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన కాలువ అయినటువంటి మదూరు కాలువ నందు గత రెండు రోజులుగా పూడికతీయుట పనులు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం అర్చన హాల్ వద్ద కాలువ పూడిక తీత పనులను పర్యవేక్షించిన కమిషనర్ పట్టణంలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు ఎలాంటి సౌకర్యం కలగకుండా అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టేందుకే ప్రధాన కాలువల పూడుకతీత పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వి సుబ్బరాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్లు జి వినోద్‌కుమార్‌రెడ్డి, యన్ దస్తగిరిలు పాల్గొన్నారు.

## ఉచిత విద్యకు మాత్రమే నిబంధనలు అవసరమా

ఎడ్యుకేషన్ మే 13 ప్రభాతవార్త

విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం బలహీన వర్గాల ప్రజలకు కేటాయించాలని అయితే ఉచిత విద్యను అప్లై చేసుకోవడానికి వెళితే కిలోమీటర్ పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే చూపిస్తుంది అని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు జగన్ ఆరోపించారు, రూరల్ ప్రాంత ప్రజలకు మండలం నుండి మినిమం 5 నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది మండల హెడ్ క్వార్టర్ లోనే చాలా చోట్ల ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి అయితే రూరల్ ప్రాంత విద్యార్థులకు ఒక కిలోమీటర్ పరిధిలోనే అప్లై చేసుకునే అవకాశం కల్పించడం వల్ల రూరల్ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలకు పక్కనే ప్రైవేట్ పాఠశాలలకు పర్మిషన్ ఇస్తూ విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వారు అన్నారు తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉచిత విద్య ప్రకారం మండల పరిధిలో ఏ ప్రైవేట్ స్కూల్‌లో అయినా చేర్పించుకోవడానికి అవకాశం కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం లేనిపక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

## జాతరకు వెళ్లి వచ్చాం

ఇంటిలో దొంగలు పడ్డారు

పీలేరు మే 13 ప్రభాతవార్త:



చల్లా చదరగా పడిన వస్తువులు

జాతరకు వెళ్లి తిరిగి వచ్చే లోపు ఇంట్లో పడి దోచేశారని బాధితులు లబోదిబోన్నారు. ఈ సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. పీలేరు పోలీసుల కథనం మేరకు పీలేరు పట్టణం చెన్నారెడ్డికాలనీలో నివాసముంటున్న శ్రీనివాసులురెడ్డి, రజనీకుమారి నివాసముంటున్నారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వేకువజామున వేపులబైలు వద్ద జరుగుతున్న అంకాల గంగమ్మ తిరుణాళ్లకు వెళ్లారు. తిరుణాళ్ల ముగించుకుని ఉదయం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే తాళాలు ధ్వంసం చేని ఇంట్లో బీరువా లోని వస్తువులన్నీ చిందర వందర చేసి ఉండడాన్ని ఇంటి యజమానులు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. వేలిముద్రల నిపుణులు వచ్చి గుర్తులు సేకరించారు. ఈ చోరీ ఘటనలో రూ.5 లక్షలు నగదు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీలేరు పోలీసులు వివరించారు.

## సిద్ధవటంలో నాకాబంది నిర్వహించిన పోలీసులు


సిద్ధవటం మే 13 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్ధవటంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో మంగళవారం నాకాబంది కార్యక్రమం నిర్వహించి పలు అనుమానితుల గృహాలు తనిఖీ చేశారు ఈ సందర్భంగాసర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో అనుమానస్పద వ్యక్తుల గృహాలు మరియు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చామని సైబర్ క్రైమ్, చోరీల నియంత్రణపై అవగాహన కల్పించామని ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే సమాచారం తెలపాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై మహమ్మద్ రఫీ స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బుద్ధునికొండలో వైభవంగా బుద్ధపున్నమి వేడుకలు

మదనపల్లి మే 13 ప్రభాతవార్త



మదనపల్లి రూరల్ మండలం, అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధునికొండపై బుద్ధ పున్నమి వేడుకలు వైభవంగా జరిగాయి. తథాగతుడు గౌతమ బుద్ధుని 2569వ జయంతిని పురస్కరించుకొని, బుద్ధ అంబేడ్కర్ సమాజ్, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించాయి. ఈసందర్భంగా బౌద్ధ ఉపాసకులు బోధి వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి, పూజలు నిర్వహించారు. రకరకాల పుష్పములతో అలంకరించిన బుద్ధుని ప్రతిమలతో తథాగతుని ప్రధాన విగ్రహం వరకూ ఊరేగింపు చేశారు. అనంతరం తథాగతుని విగ్రహం వద్ద పూజలు నిర్వహించి, త్రిశరణ, పంచశీల పటించి శరణు వేడుకున్నారుఈ సందర్భంగా బుద్ధ అంబేడ్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ ఉపాసక పీటీయం శివప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్పలు మాట్లాడుతూ సంస్కర్తలందరిలోనూ అత్యుత్తముడు బుద్ధుడని, భగవాన్ బుద్ధుడు జన్మించింది, జ్ఞానోదయం పొందింది, పరినిర్వానం చెందిందీ వైశాఖ పౌర్ణమి రోజేనని, అందుకే వైశాఖ పౌర్ణమని బుద్ధ పున్నమిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులు అత్యంత ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. బౌద్ధాన్ని అక్కున చేర్చుకున్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతుంటే, బౌద్ధానికి జన్మనిచ్చిన భారతదేశం బౌద్ధాన్ని దూరం చేసుకోవడం వల్ల అభివృద్ధికి నోచుకోలేక పోతోందని, ఆకలి, పేదరికం, నిరుద్యోగం, కుల మత లింగ అసమానతలతో విలవిల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి మీద ఆనందంగా బ్రతకడానికి ప్రతీ వ్యక్తికీ బౌద్ధం అవసరం ఉందని, అందుకే బోధిసత్వ అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించి భారతదేశంలో బౌద్ధం పునరుద్దరణకు మార్గం చూపారని చెప్పారు. భారతదేశ సమగ్రాభివృద్ధిని కోరుకొనే ప్రతీ పౌరుడు బౌద్ధ జీవన విధానాన్ని ఆచరించి, దేశాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. సైనికులకు సంఘీభావ ఉగ్రమూఖలతో సమరంలో శక్తియుక్తులు ప్రదర్శిస్తున్న త్రివిధ దళాల సైనికులకు బుద్ధ పున్నమి వేడుకల్లో ఉపాసకులు సంఘీభావం ప్రకటించారు. సైన్యం ప్రదర్శిస్తున్న ధైర్య, సాహసాలను, త్యాగాలకు దేశం తరపున కృతజ్ఞతలు తెలిపారు. భారత సైన్యం మరింత శక్తి వంతం కావాలని ఆశిస్తూ, తథాగతుడు గౌతమ బుద్ధుని ముందు మోకరిల్లి ధ్యానం చేశారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, ముత్యాల మోహన్, మలారి గిరిబాబు, జి.వి. రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, బండకోట రవి, డాక్టర్ గంగాద్రి, రవి శంకర్, వై. గంగాధర్, తలారి కృష్ణ, జనార్ధన్, వై. చిన్నా, శశికుమార్, ఉపాసికలు శాంతమ్మ, శంకరమ్మ, గంగులమ్మ, ఈశ్వరమ్మ, నాగమణి, దేవి, సుమలత, లక్ష్మి తదితరులతోపాటు ఉపాసిక, ఉపాసకులు పాల్గొన్నారు.

## ఐచర్ వాహనం బోల్తా డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ముద్దనూరు, మే 13, ప్రభాతవార్త:



కడప తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో మంగళవారం నాడు ప్రమాదవశాత్తు అనంతపురం పట్టణానికి చెందిన ఐచర్ వాహనం ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రొద్దుటూరు పట్టణంలో అన్లోడ్ చేసి తిరిగి వెళుతున్న సమయంలో మండల పరిధిలోని చింతకుంట గ్రామ సమీపన ప్రమాదవశాత్తు బోల్తా పడి డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు డ్రైవర్ తుమ్మల గంగాధర్ రెడ్డిని పట్టణంలోని ప్రవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

## చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన



సిద్ధవటం మే13 ప్రభాతవార్త

చిరుధాన్యాల సాగులో కీలక నిర్వహణ పద్ధతులు మరియు లాభదాయక ధరల కోసం విలువ జోడింపు శిక్షణ పై రైతులకు శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్ధవటం ఎంపీడీవో కార్యాలయం సభా భవనంలో మంగళవారం ఆచార్య వ్యవసాయ విద్యాలయ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో చిరు ధాన్యాలు కొర్రలు, జొన్న, సజ్జ, రాగి ఊదలు వంటి చిరుధాన్యాలపై సాగులో కీలక నిర్వహణ పద్ధతులు లాభదాయక జల కోసం విలువ జోడింపు శిక్షణ పై రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజు మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలు సాగు చేయడం రైతుకు ఎంతో లాభసాటి దిగుబడి వస్తుందని చిరుధాన్యాలు అంత ర పంటలుగా మిశ్రమ పంటలుగా సాగు చేయవచ్చని రైతులకు సూచించారు శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు విస్తీర్ణం కొరకు కృషి చేస్తున్నామని రైతులు వరి పంట సాగు అనంతరం పంట మార్పిడి క్రింద చిరుధాన్యాల పంట సాగు చేయాలని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బద్వేల్ వ్యవసాయ సంచాలకులు ఏ నాగరాజు ఏవో రమేష్ రెడ్డి శాస్త్రవేత్తలు, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అంకయ్య ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నవీన్ కుటుంబానికి అండగా నిలిచిన జయచంద్రారెడ్డి




తంబళ్లపల్లె మే 13 ప్రభాతవార్త :

గత మార్చ్ నెలలో తంబళ్లపల్లెలోని పుడమి కిసాన్ మార్ట్ లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నవీన్ ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. అప్పట్లో ఆ సంఘటన నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. దీనిపై స్పందించిన తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జైచంద్రారెడ్డి నాడు ఆ కుటుంబాన్ని ఆదుకుంటానని మాట ఇచ్చి ఆందోళన విరివింపజేశాడు. ఇచ్చిన మాటకు కట్టుబడి బిడ్డ మరణంతో ఆర్థికంగా నష్టపోయిన పెద్ద వీరభద్ర కుటుంబాన్ని ఆదుకోవడానికి పుడమి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఐదు లక్షల రూపాయల పరిహారం అందించడానికి సహకరించాడు. మంగళవారం పుడమి యాజమాన్యం ప్రసాద్, కృష్ణరామిరెడ్డి, శ్రీనివాసులు, ఆరిఫ్ లు తోపాటు బిజెపి మాజీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి ల సమక్షంలో జయచంద్రారెడ్డి నవీన్ తండ్రి పెద్ద వీరభద్ర కు ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆర్థిక సహాయానికి సహకరించిన జయ చంద్రారెడ్డి తో పాటు కంపెనీ యాజమాన్యం, మండల టిడిపి నాయకుల కు పెద్ద వీరభద్ర కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, క్లస్టర్లు ఇంచార్జ్ బేరి శ్రీనివాసులు, కాలా నారాయణ, నాయకులు ఉన్నారు.

## బిజెపి తిరంగా యాత్ర హాస్యాస్పదం

వేంపల్లి: మే 13 (ప్రభాత వార్త):



ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేటందుకు మోడీ నాయకత్వ పటిమ అని చెప్పేందుకు తిరంగా యాత్రను మే 13 నుండి 23 వరకు నిర్వహించాలని బిజెపి నిర్ణయించడం హాస్యాస్పదం. తిరంగా యాత్రకు ముందు బిజెపి నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. గత నెల 22 వ తేదీన పహల్గాం పర్యాటక కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది వుండి వుంటే ఉగ్ర వాదులు అమాయక పర్యాటకుల పై దాడి చేసేవారు కాదు, 26 మంది పర్యాటకులు చనిపోయి వుండేవారు కాదు, వారి భార్యల నుదుటి సిందూరం పోయి వుండేది కాదు, ఆపరేషన్ సిందూర్ అవసరం వుండేది కాదు. కేంద్ర ప్రభుత్వం కూడా అఖిల పక్ష సమావేశం లో భద్రతా వైఫల్యాన్ని ఒప్పుకుంది. భద్రతా వైఫల్యానికి గాను బిజెపి దేశ ప్రజలకు,పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మంది కుటుంబ సభ్యులకు, ఆపరేషన్ సిందూరు లో చనిపోయిన మురళీ నాయక్ తో సహా మిగతా సైనికుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఎవరు?ఎంతమంది? పట్టుకున్నారా?మట్టుపెట్టారా? దాడి జరిగి 22 రోజులైనా పై వివరాలు దేశ ప్రజలకు తెలియడం లేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. పహల్గాం దాడులు,ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేందుకు ప్రధాన కారణం బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2005 లో భారత నావికా దళంలో, 2007 లో భారత సైన్యం లో బ్రహ్మోస్ ను చేర్చడం గమనార్హం.

## పవిత్ర హజ్ యాత్ర సాఫీగా సాగాలి

రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్ ఖాన్



మదనపల్లి మే 13 ప్రభాతవార్త.

హజ్ యాత్ర సాఫీగా జరగాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పటాన్ ఖాదర్ ఖాన్ తెలిపారు. బెంగుళూరు హజ్ భవనంలో దగ్గర వుండి ఏర్పాట్లు పరిశీలన చేశారు. రాయలసీమ జిల్లాల నుండి పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న తోటి ముస్లింల యాత్ర సుఖ, సంతోషాలతో సాగాలని, క్షేమంగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. రాయలసీమ జిల్లాల నుండి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి బెంగళూరు హజ్ భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. కర్ణాటక హజ్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి దగ్గర వుండి ఏర్పాట్లు పరిశీలించిన పఠాన్ ఖాదర్ ఖాన్ హజ్ యాత్రకు వెళ్ళే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల ప్రత్యేక సలహాదారుల ఏం ఏ.షరీఫ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా లతో కలిసి రాష్ట్ర హజ్ కమిటి సభ్యులు పఠాన్ ఖాదర్ ఖాన్ స్కానింగ్, బ్యాగ్ ప్యాకింగ్, లోడింగ్, ట్యాగింగ్, రూమ్ అలాట్‌మెంట్, ఫూడ్ టోకన్స్ ఇలా అన్ని విధాల సౌకర్యాలను దగ్గర వుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టిడిపి నాయకులు, సామిజికవేత్త సోహెల్ బాషా, సాజిద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

## గోల్డెన్ వ్యాలీ విద్యాసంస్థల హైస్కూల్ విద్యార్థులు 100 ఉత్తీర్ణత




కురబలకోట మే 13 ప్రభాతవార్త

ఈ ఏడాది విద్యా సంవత్సరానిక తాను సీబీఎస్ఈ లో గోల్డెన్ ర్యాలీ విద్యా సంస్థలకు చెందిన హై స్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో ఘన విజయాన్ని సాధించారు. ఈ విద్యార్థులను గోల్డెన్ వ్యాలీ విద్యాసంస్థల చైర్మన్ శ్రీ ఎన్. వి.రమణారెడ్డి డైరెక్టర్ N P RAO , సి బి ఎస్ ఇ స్కూల్ ప్రి న్సిపాల్ కె వి రమణ మరియు ఉపాధ్యాయ బృందం ఈ ఫలితాలపై సంతోషాన్ని వ్యక్తపరిచి అభినందనలు తెలుపుతూ విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. 100 శాతం పాస్ అవ్వడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు మరియు విద్యార్థులను ప్రశంసించారు. విద్యార్థులు ఇలాగే భవిష్యత్తులో కూడా తమ ఏకాగ్రత మరియు పట్టుదలతో రాణించాలని విద్యాసంస్థల అధినేత కోరారు . రెడ్డిశ్రీకి 531/600 మార్కులతో ..మొదటి.. స్థానంలో నిలిచాడు. మాన్విత శ్రీ 505/600 మార్కులతో రెండవ స్థానం నిలిచారు. దీ. దీక్షిత 502/600 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు. శి సాదియా 448/600 మార్కులతో నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులను గోల్డెన్ వాలే విద్యాసంస్థల అధినేత తదితరు ఉపాధ్యాయులు అభినందించారు.

## వివాహం ఓ చట్టబద్ధమైన ఒప్పందం

ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి

పీలేరు మే 13 ప్రభాతవార్త:

వివాహం సరైన వయస్సులో చేయడమనేది మంచి దాంపత్యానికి పునాది వంటిదని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి, జాండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ వై. నీలిమ రెడ్డి తెలిపారు. మంగళవారం జాండ్ల గ్రామంలో తలుపుల పిహెచ్సి ఆధ్వర్యంలో "బాల్య వివాహాలు అనర్థాలు" అనే అంశముపై కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇద్దరు వయోజనులైన భాగస్వాముల మధ్య హక్కులు, బాధ్యతలను సూచించే చట్టపరమైన ఒప్పందం వివాహమని అన్నారు. అయితే ప్రస్తుతం ఆడపిల్లల హానికర ఆలోచనలతో అధికంగా బాల్యవివాహాలు చోటు చేసుకోవడం శ్రేయస్కరం కాదని చెప్పారు. బాల్యవివాహాల ఫలితంగా నెలలు నిండకనే కాన్పులు, తక్కువ బరువుతో బిడ్డలు పుట్టడం, మాతా శిశు మరణాలకు దారి తీయడం, వారికి కాన్పు సమయంలో తట్టుకునే శక్తి చాలక పోవడం, పిల్లలు పెంచే నైపుణ్యం లేక ఇబ్బంది పడడం వంటి సమస్యలు ఉంటాయన్నారు. ఇలా బాల్య వివాహాలు చేయడం మన సమాజ పురభివృద్ధికి అవరోధమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బాల్యవివహాలు వద్దు, చదువే ముందు అని కిషోర్ బాలికలకు వివరించారు. అనంతరం గ్రామంలో బాల్యవివాహాలు జరగకుండా నావంతు సహకరిస్తానని బాలికలచే పర్యవేక్షకులు ఉమ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఐసిడిఎస్ పర్యవేక్షకులు ఉమ, ఏఎన్ఎంలు రెడ్డిబి, కృష్ణమ్మ, స్థానిక సచివాలయ మహిళా పోలీసులు భాగ్యలక్ష్మి, దివ్య, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ రెడ్డి

